క్లుప్తంగా

ముందస్తు దసరా వేడుకలు



సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక గురవయ్యతోటలోని రాజీవ్ హైస్కూల్‌లో మంగళవారం ముందస్తు దసరా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు అమ్మవారి అలంకారాలతో చేసిన నృత్యం అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో కరస్పాండెంట్ సుధాకర్, చైర్మన్ రాజేష్, ప్రధానోపాధ్యాయురాలు టెస్సీ, సుధ, రాధిక విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా లేని వాహనాలు సీజ్



వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ డి. శ్రీనివాసులు

పోరుమామిళ్ల (అట్లూరు): పోరుమామిళ్ల పట్టణంలో రికార్డులు సక్రమంగా లేకుండా తిరుగుతున్న 40 వాహనాలను సీజ్ చేసినట్లు పోరుమామిళ్ల సిఐ డి.శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంబర్ ప్లేట్లు లేకుండా చాలా వాహనాలు తిరుగుతున్నాయని అటువంటి వాహనాలను గుర్తించి సీజ్ చేయడం జరిగిందన్నారు. రికార్డులతో పాటు వాహనదారునికి డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ తప్పని సరిగా ఉండాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవని, చిన్నారులకు ద్విచక్ర వాహనాలు ఇవ్వద్దని తల్లిదండ్రులకు సూచించారు.

ఎస్ఆర్ఐటీలో గెస్ట్ లెక్చర్



మాట్లాడుతున్న గెస్ట్ లెక్చర్ రమణరావు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో శివశివాని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ రమణరావు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మైండ్ సెట్ ఇన్ ద కార్పొరేట్ వరల్డ్ టవర్స్ సస్టైనబిలిటి అనే అంశంపై గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. బిజినెస్ మోడల్స్, బిజినెస్ ప్లాన్ ఎగ్జిక్యూషన్, స్ట్రాటజీస్, సక్సెస్ మంత్ర, స్కిల్స్‌లపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి తదితరులు పాల్గొన్నారు.

30 పోలీసు యాక్ట్ పొడిగింపు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు సబ్‌డివిజన్ పరిధిలో 30 పోలీసు యాక్ట్‌ను అక్టోబర్ 31 వరకు పొడిగించినట్లు డీఎస్పీ భక్తవత్సలం మంగళవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేపట్టరాదన్నారు. వీటికి 24 గంటల ముందు పోలీసు అధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. నిబంధనలను అతిక్రమించిన ఎడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ పేర్కొన్నారు.

చిత్రపటాల బహూకరణ



దేశ నాయకుల చిత్రపటాలతో విద్యార్థులు, దాత కిశోర్ యాదవ్, ఉపాధ్యాయులు

మైదుకూరు : మండలంలోని సుంకులుగారిపల్లె ప్రాథమికోన్నత పాఠశాలకు ఉప్పుగుంటపల్లె గ్రామానికి చెందిన కృష్ణ కిశోర్ యాదవ్ రూ.10వేలు విలువైన దేశ నాయకుల చిత్రపటాలను మంగళవారం బహూకరించారు. ఈ సందర్భంగా కిశోర్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశ నాయకుల పట్ల గౌరవాన్ని, దేశ భక్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో పాఠశాలకు దేశ నాయకుల చిత్రపటాలను అందించినట్లు పేర్కొన్నారు. ఆయనకు పాఠశాల హెడ్మాస్టర్ నాగలక్ష్మీదేవి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వరలక్ష్మీ, వహీదా, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గెజిట్ ప్రకారం ఎగ్జిబిషన్ టికెట్ ధరలు అమలు చేయాలి

ప్రొద్దుటూరు : మున్సిపల్ గెజిట్ ప్రకారం ఎగ్జిబిషన్‌లో టికెట్ ధరలను అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డికి మంగళవారం విద్యార్థి యువజన సంఘాల నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు జగన్, ప్రగతిశీల స్టూడెంట్స్ యూత్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు మాట్లాడుతూ నిబంధనల ప్రకారం వాహనాలకు పార్కింగ్ ఫీజు రూ.5, రూ.10, రూ.20ల ప్రకారం అమలు చేయాలని, జాయింట్ వీల్, బ్రేక్ డ్యాన్స్, కొలంబస్‌కు రూ.80 చొప్పున, బౌన్సర్, జంపింగ్, మినీ ట్రైన్, వాటర్ పోటీలు, బైక్ డ్రైవింగ్, హార్స్ రైడింగ్‌కు రూ.40 చొప్పున వసూలు చేయాలని ధరలు నిర్ణయించారన్నారు.

శరన్నవరాత్రి శోభ

- రేపటి నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం
- దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధం
- అందంగా ముస్తాబైన ఆలయాలు



దేవతామూర్తుల విద్యుత్ కటౌట్లు

మైదుకూరు : మైదుకూరు పట్టణంలో దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఏటా స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో దసరా ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహిస్తారు. ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు వైభవంగా ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి శాలలో అత్యంత సుందరంగా క్లాత్ డెకరేషన్, ముఖద్వారం, సీలింగ్ డెకరేషన్ ఆకర్షణీయంగా చేస్తున్నారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో దేవతామూర్తుల కటౌట్లను ఏర్పాటు చేశారు. ఉత్సవాల ఏర్పాట్లు పూర్తికావచ్చాయి. దసరా ఉత్సవాల్లో 3వ తేదీ గురువారం వాసవి మాతకు శ్రీరాజరాజేశ్వరి దేవి అలంకారం, 4వ తేదీ శుక్రవారం శ్రీగాయత్రి దేవి అలంకారం, 5వ తేదీ శనివారం శ్రీపార్వతీదేవి అలంకారంలో పూజలు నిర్వహించనున్నారు. అదే విధంగా 6వ తేదీ ఆదివారం శ్రీమహాలక్ష్మీదేవి అలంకారం, 7వ తేదీ సోమవారం శ్రీఅన్నపూర్ణాదేవి అలంకారం (తోట ఉత్సవం), 8వ తేదీ మంగళవారం శ్రీ భువనేశ్వరి దేవి అలంకారంలో పూజలు చేయనున్నారు. 9వ తేదీ బుధవారం శ్రీ సరస్వతీదేవి అలంకారం (బిందెసేవ), 10వ తేదీ గురువారం శ్రీమహిషాసుర మర్దిని అలంకారం (దుర్గాష్టమి), 11వ తేదీ శుక్రవారం శ్రీగజలక్ష్మీదేవి అలంకారం (మహర్నవమి), 12వ తేదీ శనివారం శ్రీవిజయలక్ష్మీదేవి అలంకారం (విజయదశమి)లో పూజలు నిర్వహించనున్నారు.



అమ్మవారిశాల గర్భాలయం ముందు ఆకర్షణీయంగా డెకరేషన్

శమీదర్శనం

విజయదశమి రోజున మధ్యాహ్నం 2.15 గంటలకు అమ్మవారి శమీదర్శనం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. రాత్రి అంగరంగ వైభవంగా గారమోత్సవం నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. ఉత్సవాల్లో రూపకాలు, కేరళ బ్యాండ్, చెక్కభజన తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 13వ తేదీ ఆదివారం వసంతోత్సవంతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాల్లో మహర్నవమి వరకు ప్రతి రోజు ప్రాతఃకాల పూజలు, రుద్రాభిషేకం, చండీ పారాయణం, నవగ్రహ హోమం, చండీ హోమం, మహామంగళహారతి ఉంటాయని నిర్వాహకులు వివరించారు.

బ్రహ్మంగారి మఠంలో..

బ్రహ్మంగారిమఠం: బ్రహ్మంగారిమఠంలో దసరా మహోత్సవాలు గురువారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకు నిర్వహిస్తామని మఠం పిట్‌పర్సన్ శంకర్ బాలాజీ తెలిపారు. మంగళవారం ఆయన మట్లాడుతూ 5 నుంచి 10వ తేదీ వరకు హైదరాబాద్‌కు చెందిన బ్రహ్మశ్రీ పాణ్యం దత్తశర్మ గారిచే శ్రీదేవి భాగవతం, ప్రవచనములు ఉంటాయని తెలిపారు.



వాసవి మాత మూల విరాట్

ఈశ్వరీదేవి మఠంలో..

స్థానిక ఈశ్వరీదేవిమఠంలో గురువారం నుంచి దేవీ శరన్నవరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ జగన్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, అభిషేకాలు, ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

అమ్మవారిశాలలో..

స్థానిక అమ్మవారిశాలలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో గురువారం నుంచి దసరా ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలను భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

అమ్మవారిని దర్శించుకోండి



దసరా ఉత్సవాల పది రోజుల్లోనూ ప్రతి ఒక్కరూ అమ్మవారిని దర్శించుకోవాలని కోరుతున్నా.. ఏటా మాదిరే ఈ సారి కూడా దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నాం. ప్రతి రోజు ప్రత్యేకమైన పూజలతో పాటు హోమాలు నిర్వహిస్తున్నాం. విజయదశమి రోజున కళ్లు మిరిమిట్లు గొలిపే విధంగా బాణసంచా కాలుస్తాం. ఉత్సవాల్లో పాల్గొని భక్తులు అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరుతున్నాం. – సూరిశెట్టి శివవెంకటప్రసాద్, అర్యవైశ్య సభ అధ్యక్షుడు, మైదుకూరు

నిధులు రాబట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

బద్వేలు అర్బన్ : కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై ఆధారపడి ఉన్నప్పటికీ కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సీతారాం ఏచూరి సంస్మరణ సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను అమలు చేయని ఎన్డీఏ ప్రభుత్వానికి కూటమి ప్రభుత్వం తన మద్దతు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాభివృద్ధికి, రాజధాని నిర్మాణానికి, పోలవరం నిర్మాణానికి, కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి నిధులు రాబట్టలేనప్పుడు కూటమి ప్రభుత్వం ఎన్డీఏ ప్రభుత్వానికి ఎందుకు మద్దతు ఇవ్వాలని ప్రశ్నించారు. అలాగే భూకబ్జాలపై కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు శ్వేతపత్రం విడుదల చేయకపోవడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కె.శ్రీను, పట్టణ నాయకులు ఎం.చిన్ని, మోక్షమ్మ, ఖైరున్, బాలయ్య, మస్తాన్‌బీ, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్స్ అసోసియేషన్ నాయకులు

బద్వేలు అర్బన్ : ఎన్నికల సమయంలో కూటమి నేతలు వలంటీర్లకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో ఏపీ గ్రామ, వార్డు వలంటీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వలంటీర్లు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వలంటీర్లను తొలగించమని, రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చి ఎన్నికలు పూర్తయిన తర్వాత ఆ హామీని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అంతేకాకుండా వలంటీర్లకు రావాల్సిన బకాయి వేతనాలను కూడా చెల్లించకపోవడంతో వలంటీర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఆలోచించి వలంటరీలకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. అనంతరం టీడీపీ యువనేత రితీష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వలంటీర్స్ అసోసియేషన్ నియోజకవర్గ ఇన్‌చార్జి సాదిక్, నియోజకవర్గ నాయకులు రఫి, భవానిప్రసాద్, దీప్తి, పెంచలప్రసాద్, మురళి, ఫణీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మానవసేవే.. మాధవ సేవ



కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సమాజ సేవకుడు అవార్డు అందుకుంటున్న రామకృష్ణారెడ్డి

కలసపాడు : మానవసేవయే మాధవసేవ అని వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి అన్నారు. సమాజంలోని ఎంతో మంది అభాగ్యులను, అనాథలను ఆదరిస్తూ వారికి ఆశ్రయం కల్పిస్తూ అనాథ శవాలకు అంతిమ సంస్కారాలు నిర్వహిస్తూ పేద పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేస్తూ.. సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న మండలంలోని తెల్లపాడు గ్రామానికి చెందిన పాపిజెన్ని రామకృష్ణారెడ్డికి గుర్తింపు లభించింది. మంగళవారం కడప కలెక్టరేట్ సభా భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లోతోటి శివశంకర్ రామకృష్ణారెడ్డి చేస్తున్న సేవలను అభినందిస్తూ ఉత్తమ సమాజ సేవకుడు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా తనకు సహకారం అందించే ప్రతిఒక్కరికి రామకృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మరింత బాధ్యతగా సేవ చేసేందుకు పాటుపడతానని పేర్కొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని ఆందోళన

బద్వేలు అర్బన్ : గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మంగళవారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు, సిబ్బంది ప్రభుత్వ మద్యం దుకాణాలు మూసివేసి ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ డివిజన్ నాయకులు ఎస్.నారాయణస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీని అమలు చేయాలని నిర్ణయించడంతో ఐదేళ్ళ పాటు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విధులు నిర్వహించిన వేలాది మంది ఉద్యోగులు రోడ్డున పడాల్సిన పరిస్థితి దాపురించిందని అన్నారు. ప్రొద్దుటూరు డిపో పరిధిలో గల 84 మద్యం దుకాణాల్లో దాదాపు 300 పైచిలుకు మంది సేల్స్‌మెన్స్, సూపర్‌వైజర్లు, నైట్‌వాచ్‌మెన్‌లుగా పనిచేస్తున్నారని, వీరందరికి వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నరసింహారావు, సుబ్బారెడ్డి, నూరుల్లా, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు వారసత్వంగా వాసవాంబ ఉత్సవాలు

మన చరిత్ర ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరులో దసరా ఉత్సవాలను శ్రీ వాసవాంబ ఉత్సవాలుగా నిర్వహించడం సంప్రదాయంగా వస్తోందని ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్ రావు, లయన్ జొన్నలగడ్డ రామచంద్ర ప్రకాష్ తెలిపారు. అమ్మవారిశాలలో మంగళవారం ఇంటాక్ సంస్థ రూపొందించిన మన చరిత్ర ప్రొద్దుటూరు దసరా ఉత్సవాల ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దసరా ఉత్సవాలను ఎన్నో ఏళ్లుగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. దసరా ఉత్సవాల్లో అందరూ పాల్గొనాలని కోరారు. ఈ సంప్రదాయాన్ని మరింత ప్రచారం చేసి భావితరాలకు చాటేలా ఈ మాసం మన చరిత బులెటిన్ దసరా ఉత్సవాలను ప్రత్యేకంగా రూపొందించడం విశేషమన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ ప్రతినిధులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



సిద్ధమూర్తిపల్లెలో వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

కలసపాడు : వరి, పత్తి పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయాధికారి జాకీర్‌షరీఫ్ తెలిపారు. మండలంలోని మహానందిపల్లె రైతు సేవా కేంద్రం పరిధిలోని సిద్ధమూర్తిపల్లె గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రైతులకు యాజమాన్య పద్ధతులపై జాకీర్‌షరీఫ్ అవగాహన కల్పించారు. వరి, పత్తి పంట యాజమాన్య పద్ధతులపై సూచనలు ఇచ్చారు. వరి పంటలో సుడిదోమ, ఎండుతెగులు యాజమాన్య పద్ధతులు, పిచికారి చేయాల్సిన మందుల గురించి వివరించారు. కార్యక్రమంలో వీఏఏ అశోక్‌కుమార్‌రెడ్డి, ఏపీసీఎంఎస్ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు : మండలంలోని మిట్టమానుపల్లె, పప్పనపల్లె గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యాన, మైక్రో ఇరిగేషన్, హార్టికల్చర్ యూనివర్సిటీ నుంచి అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో క్షేత్రస్థాయిలో వివిధ పంటల్లో పురుగు, తెగుళ్లకు నివారణ చర్యల గురించి అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.లక్ష్మీప్రసన్న, ఉద్యాన శాఖ అధికారి రామకృష్ణ, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్, హార్టికల్చర్ యూనివర్సిటీ అధికారి గురప్ప, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అవసరం మేరకూ ఎరువులు వినియోగించాలి

చాపాడు: వరి పైర్లలో అవసరం మేరకు మాత్రమే యూరియా ఇతర రసాయన ఎరువులను వినియోగించావాలని వ్యవసాయశాఖ మైదుకూరు డివిజన్ ఏడీఏ కృష్ణమూర్తి అన్నారు. మండల పరిధిలోని అయ్యవారిపల్లె, అనంతపురం గ్రామాలలో మంగళవారం మండల వ్యవసాయాధికారి మ్యాగీ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

కలసపాడు : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోరుమామిళ్ల సీఐ డి.శ్రీనివాసులు హెచ్చరించారు. మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ మండలంలో నాటుసారా, మహిళల వేధింపులు, ఈవ్‌టీజింగ్, జూదం లాంటి అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జూనియర్ కళాశాల, బాలికల ఉన్నత పాఠశాలల వద్ద ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే అలాంటి వారిపై తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇస్తామని తెలిపారు. రాత్రి వేళల్లో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రైవేటు ట్రావెల్స్‌తో మూడు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీన్‌అంబాసిడర్ల సేవలు అభినందనీయం



రాచాయపేటలో గ్రీన్‌అంబాసిడర్లను సన్మానిస్తున్న అధికారులు, గ్రామస్తులు

గోపవరం : ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్న ధ్యేయంతో వారి ఆరోగ్యాలను పణంగా పెట్టి నిత్యం గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేస్తున్న గ్రీన్‌అంబాసిడర్ల సేవలు అభినందనీయమని సర్పంచ్ నాగదాసరి నాగేంద్ర, ఈఓపీఆర్‌డీ హసీనా కొనియాడారు. గత నెల 18వ తేదీ నుంచి ఈ నెల 2వ తేదీ వరకు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించామని ఈఓపీఆర్‌డీ తెలిపారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం ముగింపు సందర్భంగా రాచాయపేట గ్రామ సచివాలయం పరిధిలో పనిచేస్తున్న గ్రీన్‌అంబాసిడర్లను సర్పంచ్, ఈఓపీఆర్‌డీ, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

నేడు ఉపాధిపై గ్రామసభలు

బి.కోడూరు : గాంధీ జయంతి సందర్భంగా మండలంలోని పది పంచాయతీల పరిధిలోని గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి బుధవారం గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భాస్కర్‌రావు తెలిపారు. పది పంచాయతీలకు సంబంధించి పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించామన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆదాయ వనరులు సమకూర్చుకోవాలి

చాపాడు: గ్రామ పంచాయతీలకు ఆదాయ వనరులను గ్రామంలో సమకూర్చుకోవాలని, దీనికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని మండల అభివృద్ధి అధికారి శ్రీధర్‌నాయుడు అన్నారు. స్వచ్ఛ తా హి సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రమైన చాపాడులోని ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్‌ను పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామంలో సేకరించిన తడి పొడి చెత్తలను క్లాప్ మిత్రలు ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్‌లలో వేర్వేరుగా చేసి వాటి ద్వారా గ్రామ పంచాయతీకి ఆదాయాన్ని పొందాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను విక్రయించడం వలన.. తడి చెత్తను ఉపయోగించి వర్మీ కంపోస్టు ద్వారా ఎరువును తయారు చేయటం వలన ఆదాయం పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా క్లాప్ మిత్రలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, సర్పంచ్ మహబూబ్ బీ, పంచాయతీ కార్యదర్శి ధనుంజయ, టీడీపీ నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, సలీం, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



సామాజిక ఆరోగ్య కేంద్రంలో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించిన ఎన్‌సీసీ విద్యార్థులు

మైదుకూరు : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మైదుకూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ కరీముల్లా అన్నారు. మంగళవారం క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం అమ్మ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రి పరిసరాలను శుభ్రం చేశారు. ముందుగా స్థానిక జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూల్‌కు చెందిన ఎన్‌సీసీ, స్కౌట్ విద్యార్థులతో హైస్కూల్ నుంచి రాయల కూడలి వరకు స్వచ్ఛతామి సేవా కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కలిప్తూ ర్యాలీ నిర్వహించారు. కూడలిలో విద్యార్థులు మానవ హారంగా ఏర్పడి పరిశుభ్రతపై నినాదాలు చేశారు. అనంతరం సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో పిచ్చి మొక్కలను, ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అమ్మ సేవా సమితి అధ్యక్షుడు శివశంకర్, ఎన్‌సీసీ ఆఫీసర్ సురేంద్ర నాయక్, సతీష్ బాబు, డాక్టర్ నాగయ్య, డాక్టర్ శివకుమార్, ప్రవీణ, ఆనంద్‌రెడ్డి, ఇమాం పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో...

స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సమీపంలోని ఇందిరమ్మ కాలనీలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి పీవీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కాలనీలోని వీధులను, ప్రభుత్వ పాఠశాల ఆవరణాన్ని వారు శుభ్రం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌బీ సురేష్‌బాబు, ఎన్ఎస్ఎస్ అధికారి రవి కళ్యాణ్ పాల్గొన్నారు.

స్వచ్ఛతా హి సేవా కళాజాత

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరం మోరీ వద్ద స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంపై ప్రజా చైతన్య కళా సమితి కళాకారులు మంగళవారం కళాజాత నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలు, తడిచెత్త, పొడిచెత్త తదితర అంశాలపై పాటలు, మ్యాజిక్‌షో ద్వార ప్రజలను చైతన్య పరిచారు.

‘చెకుముకి’తో శాస్త్రీయ దృక్పథం పెంపు



బద్వేలు అర్బన్ : విజేతలకు బహుమతులు అందజేస్తున్న జేవీవీ నాయకులు



బ్రహ్మంగారిమఠం: చెకుముకి పోటీలలో గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు



కలసపాడు: విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం ప్రభావతి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి చెకుముకి పోటీలు దోహదపడతాయని వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిద్దేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక తొగటవీర క్షత్రియ కళ్యాణ మండపంలో మండలస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెకుముకి పరీక్ష రాయడం వలన విద్యార్థులలోని ప్రతిభా పాటవాలు వెలుగులోకి వస్తాయన్నారు. తొగటవీర క్షత్రియ కల్యాణ మండప అధ్యక్షుడు బండారు రఘురామయ్య మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక సేవాకార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. పాఠశాల స్థాయిలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు సర్టిఫికేట్‌లు, మెమెంటోలు అందజేశారు. తొగటవీర క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, మురళీగుప్తా, రాజేష్, బాలసుందర్, మురుకూటి సూర్యనారాయణ, ఉషారాణి, దేవమణి, మధు, మీన, మౌనిక, హేమలత, కృష్ణవేణి, చైతన్య పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్టులో విద్యార్థుల ప్రతిభ

కలసపాడు : మండలంలోని సెయింట్ ఆంటోనీస్ పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ఎస్.కె. ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మంగళవారం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞానవేదిక మండల సెక్రెటరీ గురయ్య ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టును నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్టులో సెయింట్ ఆంటోనీస్ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు చిత్తాప్రభావతి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు జ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఇలాంటి పోటీతత్వ పరీక్షలు ఎంతో అవసరమని తెలిపారు. విద్యార్థులకు బహుమతులు, మెడల్స్, మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఆలిండియా హ్యాండ్ రైటింగ్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ మల్లేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెకుముకి పోటీలు

కాశినాయన : మండలంలోని నరసాపురం మోడల్ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం చెకుముకి పోటీలు నిర్వహించారు. మోడల్ పాఠశాలకు చెందిన లల్లి, శోభ, వర్షిణిలు ప్రథమ స్థానంలో నిలిచారు. వీరికి పాఠశాల ప్రిన్సిపాల్ సౌజన్య బహుమతులు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం: బ్రహ్మంగారిమఠంలో మంగళవారం మండల స్థాయి చెకుముకి సైన్స్ పోటీలు విజయవంతం అయ్యాయని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ చెకుముకి పోటీలకు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతా రామిరెడ్డి, సీవీ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, రత్నం, వసంతకుమారి, ప్రణయ్, ఓబులపతి, చిట్టిబాబు, ఓబులేసు, రవి, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం పెంపొందించడమే లక్ష్యం

బద్వేలు అర్బన్ : విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడమే లక్ష్యమని జనవిజ్ఞానవేదిక జిల్లా గౌరవ సలహాదారులు చింతంరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి కె.శివప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బద్వేలు, గోపవరం మండలాల చెకుముకి సైన్స్ ట్యాలెంట్ టెస్ట్ పరీక్ష నిర్వహించి విజేతలను ప్రకటించారు. ఇందులో బద్వేలు మండలానికి సంబంధించి మొదటి స్థానంలో జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, ద్వితీయ స్థానంలో బాలికల ఉన్నత పాఠశాల, తృతీయ స్థానంలో చిన్నకేశంపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలు నిలిచాయి. అలాగే గోపవరం మండలానికి సంబంధించి రాచాయపేట జెడ్పీ హైస్కూల్ ప్రథమ స్థానంలో నిలవగా, పూసలవాడ జెడ్పీ ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానంలో, బి.వి.ఆర్.నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాల తృతీయ స్థానంలో నిలిచాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షులు కొండపల్లిచిన్నసుబ్బారావు, జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు రమేష్‌రాజా, నరసింహారెడ్డి, ఆంథోని, సుబ్బారావు, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.